# హిందూ ధర్మ సమ్మేళన కమిటీకి ఆర్యవైశ్య సంఘం అభినందనలు




**ఆర్యవైశ్య ఐక్యతకు మారుపేరు పరకాల వైశ్యులు.**
**అధ్యక్షులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు**
**పరకాల ఏప్రిల్ 29 (వుదయం ):**

పరకాల పట్టణంలో మంగళవారం నిర్వహించిన హిందూ సమ్మేళనం విజయవంతం కావడానికి కృషి చేసిన సమ్మేళన కమిటీ సభ్యులను పరకాల మండల ఆర్యవైశ్య సంఘం అభినందించింది. బుధవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో సంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పరకాల పట్టణంలో హిందూ సమ్మేళనం నిర్వహించడం బృహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. పట్టణ ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం హర్షణీయమన్నారు. ఆర్యవైశ్య సంఘం తరఫున కూడా తమ వంతు సహకారం అందించామని తెలిపారు.ఇలాంటి హిందూ సమాజ సమావేశాల ద్వారా హిందూ మత ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియజేయవచ్చని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు ఆర్యవైశ్య సంఘం సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బిజెపి కోశాధికారి ఎర్రం రామన్న, బిజెపి నాయకులు కాచం గురు ప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నాయకులు చిటికేసి కృష్ణమూర్తి,ఎక్కటి రమేష్, ఎల్లంకి రవీందర్ ,దేవా సతీష్, తేనుకుంట్ల పున్నం చందర్, ఎర్ర లక్ష్మణ్, కొడకండ్ల మనోహర్, సూధం రఘువీర్, వైశ్య సంఘం మహిళలు పుర ప్రముఖులు పాల్గొన్నారు

# పది ఫలితాలలో పోగుళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రభంజనం





**పదవ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత!**
**కొత్తగూడ ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి ):**

మండలం లోని పోగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులైనా, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన 42 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించి (100%) పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు.ఈ ఫలితాల్లో ప్రథమ స్థానం గుగ్గిళ్ల ఛానస్వి (556 మార్కులు)ద్వితీయ స్థానం: హరిదాస్యం అక్షయ (554 మార్కులు) తృతీయ స్థానం: భైరబోయిన నలినాప్రాభాత (553 మార్కులు) సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ..

విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల కృషి వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు ఉపాధ్యాయ బృందం ను,విద్యార్థులను అభినందించారు.

# తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై దృష్టి సారించాలి




**ఎస్సై పవన్ కుమార్**
**మహదేవపూర్ ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి)**

తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై దృష్టి సారించి చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు పిల్లల ప్రవర్తను గ్రహిస్తూ పిల్లలను క్రీడలు, చదువు, నైపుణ్యాలపై దృష్టి పెట్టే విధంగా శ్రద్ధ వహించాలని మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ అన్నారు మహదేవపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బుధవారం మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలకు, యువతకు విద్యార్థులకు మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై పవన్ కుమార్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు, గ్రామ ప్రజలకు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై పడే చెడు ప్రభావాల గురించి వివరించారు మత్తు పదార్థాల వాడకం వల్ల కాలేయం, గుండె, మెదడు దెబ్బతినడం, మానసిక వ్యాధులు రావడం వంటి ఆరోగ్య సమస్యలు ఎదురైతే వెల్లడించారు డ్రగ్స్‌కు అలవాటు పడితే చదువు ఉద్యోగం, కుటుంబ పరువు కోల్పోయి నేరాల వైపు మళ్లే ప్రమాదం ఉందని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు చెడు స్నేహాలు, ఒత్తిడి కారణంగా యువత డ్రగ్స్ వైపు ఆకర్షితులు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యువతకు విద్యార్థులకు అవగాహన కల్పించారు గ్రామంలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నా, సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం పూర్తిగా నిషేధం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు నిషేధిత మత్తు పదార్థాల రవాణా విక్రయంపై ప్రజలు నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాగే సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని వెల్లడించారు డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు. మత్తు వద్దు భవిష్యత్తు ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి అన్నారు.తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, చదువు, నైపుణ్యాలపై దృష్టి పెట్టే విధంగా శ్రద్ధ వహించాలని అన్నారు కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు యువత విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు

# వ్యవసాయ మార్కెట్ ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే 'చల్లా'



**వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.**
**పరకాల, ఏప్రిల్ 29:వుదయం ప్రతినిధి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.బుధవారం పరకాల వ్యవసాయ మార్కెట్ లోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతుల దుస్థితిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కేంద్రంలో కాంటాలు లేకపోవడం, గన్నీ సంచులు అందకపోవడం, కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో పంటను కల్లాల్లో వేసి రోజుల తరబడి కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొన్నదని రైతులు వాపోయారు. "పంట పండించేది రైతు... లాభం మాత్రం దళారులకే" అన్న పరిస్థితిని ఈ ప్రభుత్వం మరింతగా పెంచిందని ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేసీఆర్ హయాంలో రైతును రాజుగా గౌరవిస్తే, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతు బానిస స్థాయికి దిగజారిపోయాడని తీవ్ర విమర్శలు చేశారు. "రైతు భరోసా ఎక్కడ? రైతు బీమా ఎవరికి అందుతోంది? పంట కొనుగోళ్లు ఎందుకు నిలిచిపోయాయి?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.వ్యవసాయ రంగంపై పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ప్రభుత్వం, రైతుల కష్టాలను పట్టించుకోకుండా కేవలం ప్రచార రాజకీయాలకు పరిమితమైందని విమర్శించారు. యూరియా కొరత, సాగునీటి సమస్య, కరెంట్ కోతలు అన్నీ కలిపి రైతును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని అన్నారు."ఇది ప్రభుత్వం కాదు... రైతులపై భారంగా మారిన వ్యవస్థ" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ చుట్టూ తిరుగడంలో బిజీగా ఉన్న సీఎం, రైతుల కన్నీళ్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా మక్కల కొనుగోలు కేంద్రాలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ సెంటర్ లను ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**పరకాల ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి)**

పరకాల నియోజకవర్గ పరిధిలోని నడికూడా మండలం రామకృష్ణాపురం చౌటుపర్తి ముస్తాలపల్లి నరసక్కపల్లి గ్రామాల్లో ఐకేపీ సెంటర్లను ప్రారంభించిన వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ..

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో రైతులకు రైతాంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతుని రాజునూ చేయటం మరియు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటం లోభాగం గా రైతు పండించిన సన్న వడ్లకు 500 బోనస్ ను ప్రకటించింది.తద్వారా గత 11 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధం గా రైతులు సన్న వడ్లను పండిస్తూ ఆర్థికంగా భరోసా పొందుతున్నారు.

మహిళలతో ఐకేపీ సెంటర్ లను నడిపించుతూ వారికి ఆర్థికపరంగా భరోసా కలిపిస్తున్నారు.గత పది సంవత్సరాలలో లేని విధం గా అర్హులైన అందరికి రేషన్ కార్డులు ఇచ్చి రైతుల వద్ద అధిక ధరతో 500 బోనస్ తో కొన్న సన్న వడ్లను బియ్యం గా మార్చి మల్లి తిరిగి ఉచిత సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నారు ఇలా రైతులకు మహిళలకు ఎన్నో విధాలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని తెలిపారుఇట్టి కార్యక్రమంలో ఎంఏఓ జైసింగ్, ఎంఈఓ, ఏ పి ఎం గ్రామ సర్పంచులు ఐకేపీ సెంటర్ నిర్వాహకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ రంజాన్ అలీ బొమ్మకంటి రుద్రమ చంద్రమౌళి రైతు సోదర సోదరీ మణులు రైతు నాయకులూ సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కామ్రేడ్ రాజయ్య స్పూర్తితో ఉద్యమిస్తాం



**సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు.**
**ఘనంగా కామ్రేడ్ కంపేటి. రాజయ్య అంతిమయాత్ర.**
**భూపాలపల్లి ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి):**

భూపాలపల్లి ప్రాంతంలో అనేక ఉద్యమాల్లో, పోరాటాల్లో, పార్టీ నిర్మాణంలో విశేష కృషి చేసిన కామ్రేడ్ రాజయ్య స్పూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని , కరీంనగర్ పట్టణంలోని రేగుర్తి, బృందావన కాలనీ రోడ్ నెంబర్ వన్ లో కామ్రేడ్ కంపేటి రాజయ్య అంతిమయాత్ర ఘనంగా నిర్వహించడం జరిగింది. అంతిమ యాత్రకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు మంద నరసింహారావు, టి రాజారెడ్డి,సిపిఎం భూపాలపల్లి, జిల్లా కార్యదర్శులు బందు సాయిలు, సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం సుక్కయ్య, బోట్ల చక్రపానీలు , సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఏ ముత్యంరావు అన్నారు. సిఐటియు రాష్ట్ర సీనియర్ నాయకులు పి రాజారావు కంపేటి రాజయ్య భౌతికకాయానికి పూలమాల లేసి జోహార్లు అర్పించారు. సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందిన కంపేటి రాజయ్య(68) భౌతిక కాయంపై బుధవారం ఉదయం నాలుగు జిల్లాల నాయకత్వం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కంపేటి రాజయ్య ఇంటి నుండి స్మశాన వాటిక వరకు ఎర్రజెండాలు చేతబట్టి కామ్రేడ్ రాజయ్యకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభకు, సిపిఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి అధ్యక్షత వహించగా నాయకులు ప్రసంగించారు. కామ్రేడ్ కంపేటి రాజయ్య సిపిఎం పార్టీ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా, సింగరేణి సంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, సిఐటియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేశారు. చివరి శ్వాస వరకు శ్రమజీవులను ఐక్యం చేయడం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఉద్యమ సమయంలో పోలీసులు అనేక కేసులు పెట్టారన్నారు. కేసులు, నిర్బంధాలను లెక్కచేయకుండా ప్రజల కోసం పనిచేసిన నిబద్ధత కలిగిన కామ్రేడ్ అని కొనియాడారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కార్మిక వర్గ హక్కుల కోసం గొంతెత్తిన ధీరుడు అన్నారు. జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా చివరి శ్వాస వరకు పనిచేశారని గుర్తు చేశారు. వీరి మరణం పార్టీకి ప్రజా సంఘాలకు, పేద ప్రజలకు తీరని లోటు అన్నారు. గుడిష వాసులకు పట్టాలు రావాలని ఉద్యమించాడని అన్నారు.వీరి స్ఫూర్తితో జిల్లాలో శ్రామిక వర్గం పక్షాన నిరంతరం పోరాడుతామన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మంద నరసింహ రావు టి రాజారెడ్డి తో పాటు సిపిఎం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలు, చివరి అంత్రమయాత్రలో కామ్రేడ్ కంప్లీట్ రాజయ్య ఆడేమోయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎడ్ల రమేష్, పోలేం రాజేందర్,గుర్రం దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు విజయలక్ష్మి, ఎస్ ప్రీతి, గడప శేఖర్, ఆకుదారు రమేష్, బిక్షపతి, మందమర్రి వెంకటస్వామి, మెండే శ్రీనివాస్ లతోపాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కరీంనగర్ జిల్లా, హనుమకొండ జిల్లా, పెద్దపెల్లి జిల్లా నాయకులు కార్యకర్తలు, బంధువులు, స్నేహితులు, సిపిఐ పార్టీ కరీంనగర్ జిల్లా నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల ఉత్తీర్ణతలో రాష్ట్రంలో జిల్లాకు 11వ ర్యాంకు

**జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్**
**జయశంకర్ భూపాలపల్లి**
**ఏప్రిల్ 29 (వుదయం జిల్లా ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలను మార్చి 14 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు నిర్వహించనైనది. మన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలలో 122 పాఠశాలల నుండి 3544 మంది విద్యార్థులు హాజరు అయినారు 3483 మంది ఉత్తీర్ణత సాధించగా 98.36% శాతంతో రాష్ట్రస్థాయిలో జయశంకర్ భూపాలపల్లికి 11 ర్యాంకు లభించినది. గత ఏడాది 93.5% ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 22వ స్థానంలో నిలిచిందని సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి యం. రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పఠనంలో మనసును పెట్టడం కష్టపడి చదవడం మరియు లక్ష్యాల పట్ల పట్టుదలతో ఉండడం విద్యార్థులకు అత్యంత ముఖ్యమైనవని పరీక్షల ముందు వారికి తెలియజేస్తూ ప్రతి విద్యార్థికి చదువు విజయం సాధించు అని ప్రేరణను అందించి వారి ద్వారా మంచి ఫలితాలను రాబట్టగలిగామని

ఈ సందర్భంగా విద్యార్థులను మరియు ఉపాధ్యాయులను అభినందించారు ఈ సందర్భంగా ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి సామల రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎన్నో ఆశలతో బంగారు భవిష్యత్ అందించాలని ఆశిస్తారు వారి కలలు నిజం కావాలంటే వాటికోసం కష్టపడాల్సిందే

అని ప్రతి విద్యార్థికి తెలియజేస్తూ పదవ తరగతి పరీక్షల కొరకు ప్రత్యేక తరగతులు విషయ నిపుణులచే నిర్వహిస్తూ ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా అర్థమయ్యే రీతిలో తిరిగి బోధించే విధంగా, ప్రధానోపాధ్యాయులు అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపే విధంగా,

మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులు విజయం సాధించేందుకు అందరూ కృషి చేశారని అన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో ఎస్.పి.ఆర్. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రభంజనం


583/600


581/600

**హసన్ పర్తి ఏప్రిల్29 (వుదయం ప్రతినిధి):**

మండల కేంద్రంలోని ఎల్లాపూర్ శివారులోని ఎస్. పి.ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల పదో తరగతి ఫలితాలలో ఉత్తమ శ్రేణి ఫలితాలను సాధించి విజయకేతనం ఎగరవేసింది. కేవలం బోధన మాత్రమే కాకుండా నిర్దిష్ట నైపుణ్యాల పరిజ్ఞానాన్ని అందిస్తూ విలువలే ప్రధానంగా కొనసాగుతున్న ఎస్.పి.ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల గత 17 సంవత్సరాల నుండి నూటికి నూరు శాతం ఫలితాలతో విజయ దంకా మోగిస్తూ వస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 10వ.తరగతి పరీక్షా ఫలితాలలో(202526) 100% ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ఆర్. అనూప్ రెడ్డి 583, బి. అక్షయ 581, యం విద్యాత్ రెడ్డి 578, కె.సుశాంత్ భరద్వాజ్ 576, జి.శ్రీశాంత్ 573 ఉత్తమ మార్కులను సాధించడమే కాకుండా 580 మార్కులకు పైగా ఇద్దరు విద్యార్థులు, 570 మార్కులకు పైగా 7 గురు విద్యార్థులు, 560 మార్కులకు పైగా 18 మంది విద్యార్థులు, 550 మార్కులకు పైగా 30 మంది విద్యార్థులు, 500 మార్కులకు పైగా 131 మంది విద్యార్థులు ఫలితాలను సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. అంతేకాకుండా మొత్తం 209 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 209 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రతి విద్యార్థి సరాసరి 509.72 మార్కులు సాధించడం జరిగింది.

ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జగన్ మోహన్ మాట్లాడుతూ..., ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందిస్తూ, ఇంతటి ఘన విజయం సాధించడానికి గల కారణం పాఠశాలలో నిర్వహించే ప్రత్యేకమైన బోధన వ్యూహాలు, నిర్దిష్ట ప్రణాళికలు, ప్రతీ కార్యక్రమంలో నైతిక, సామాజిక విలువలు ఉండేలా బోధిస్తూ విద్యార్థులలో ఆత్మ ధైర్యాన్ని పెంపొందించేలా విద్యను అందించడమే కాకుండా విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొందేలా కేవలం పదవ తరగతి ఫలితాలలోనే కాకుండా అన్ని రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పాఠశాల ఎస్.పి.ఆర్. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అని, ఈ ఫలితాలలో ఉపాధ్యాయుల యొక్క అపూర్వమైన సహకారం కూడా ఎంతో ఉందని వారికి అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు మాట్లాడుతూ...,ప్రస్తుత విద్యా విధానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తూ, వారు పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా ప్రత్యేక శిక్షణ ఇస్తూ, తరగతులలో వెనుకబడిన విద్యార్థులకు బృహత్తర పద్ధతుల్లో పాఠ్య ప్రణాళికలను రూపొందించి బోధించడం వలన గణనీయమైన అభివృద్ధిని సాధించగలుగుతున్నామని తెలిపారు. ఈ ఫలితాల సాధనలో ముందంజలో నిలిచిన విద్యార్థులను అన్ని రకాల సహకారాలను, అన్ని రకాల సహకారాలను అందిస్తున్న తల్లిదండ్రులను, అంకిత భావంతో పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయులను పాఠశాల యజమాన్యం అభినందించింది.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం... విద్యార్థులకు మందుల పంపిణీ




**హనుమకొండ టౌన్, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి) :**

వేసవి తీవ్రత, వార్షిక పరీక్షల నేపథ్యంలో హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) హెల్త్ క్లబ్ మరియు జంతు శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షల సమయంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఎస్సార్ మెడికల్ ఏజెన్సీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి సహకారంతో

హాస్టల్ విద్యార్థులకు అవసరమైన మందులను అందజేస్తున్నామని తెలిపారు. వడ్డేపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లిక విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వేసవిలో వడదెబ్బ, డీహైడ్రేషన్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అధికంగా నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాలని, జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని, హెల్త్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ పి. సుభాషిని, పీహెచ్‌సీ సిబ్బంది కమలాకర్, డాక్టర్ డి. రామ కృష్ణారెడ్డి,

డాక్టర్ డి. సురేష్ బాబు, డాక్టర్ అరుణ, డాక్టర్ లకన్ సింగ్, డాక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.వేసవిలో విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా పింగిళి కళాశాల ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది.

# కాట్రపల్లిలో మోటార్ల విక్రయం కార్యదర్శిపై ఆరోపణలు



తీకి చెందిన సబ్‌మర్సిబుల్ మోటార్లు సుమారు ₹97,000 విలువైనవి అనుమానాస్పద పరిస్థితుల్లో విక్రయించబడినట్లు తెలిసింది.

ఈ లావాదేవీలకు సంబంధించిన ఎలాంటి అధికారిక రికార్డులు లేకపోవడం గమనార్హంగా మారింది. బుధవారం ఈ సంఘటన పై వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు, మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి కూడా లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.పంచాయతీ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల గ్రామ నిధులకు నష్టం కలిగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

ఈ వ్యవహారం పై సంబంధిత అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. పూర్తి స్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## 98 శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల.



**ఉపాధ్యాయుల అంకితభావం పిల్లల కృషి ఈ విజయానికి నాంది.**
**ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు.**
**వరంగల్ జిల్లా నర్సంపేట**
**వుదయం ప్రతినిధి ఏప్రిల్ 29.**

బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో నర్సంపేట పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల నర్సంపేట ఉత్తమ ఫలితాలను సాధించడం జరిగింది. మొత్తం 73 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్ష రాయగా 71 మంది ఉత్తిర్ణులు కావడమే కాక బేరి హెప్సిబా అనే పాఠశాల విద్యార్థి 556 మార్కులు సాధించి మండలం లోనే టాపర్ గా నిలవడం ఆదర్శ పాఠశాలగా ఉండడం పాఠశాల అందిస్తున్న విద్యా కార్యక్రమాలకు నిదర్శనం పాఠశాల విద్యార్థిని

బేరి హెప్సిబా 556 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల తరుపున మండల టాపర్గా నిల్వడం, మరియు పాఠశాల నుండి 8 మంది విద్యార్థులు 500 పై చిలుకు మార్కులు తెచ్చుకోవడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనంగా భావించవచ్చునని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు అన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సంగెపు స్వరూప అభినందించారు.

## పదవ తరగతి ఫలితాల్లో మెరిసిన జిల్లా ప్రజా పరిషత్ విద్యార్థులు




**నర్సంపేట వుదయం ప్రతినిధి ఏప్రిల్ 29.**

పదవ తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో మండలంలోని మహేశ్వరం గ్రామ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. సందర్భంగా విడుదలైన ఫలితాల్లో 600 మార్కులకు గాను దినేష్ 549 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. వైష్ణవి 542 మార్కులు, హాసిని 506 మార్కులు, ప్రియాంక 502మార్కులు సాధించివిశేష ప్రతిభ కనబరిచారు. వీరి విజయంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులుస్వరూప ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను ఆమె అభినందించారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో ఉన్నత విద్యలోనూ రాణించి పాఠశాలకు మరిన్ని విజయాలు తీసుకురావాలని కోరారు.

# సేంద్రీయ పద్దతిలో అధిక దిగిబడులతో లాభాలను పెంచుకోవచ్చు



**రాయపర్తి ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి):**

సేంద్రీయ పద్ధతిలో అధిక దిగుబడులు సాధించడంతోపాటు లాభాలను పెంచుకోవచ్చని వరంగల్ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ విశ్వతేజ డాక్టర్ బి సౌందర్ అన్నారు. బుధవారం మండలం, కొండాపూర్ గ్రామపంచాయతీ లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ వ్యవసాయ పరిశోధనశాస్త్రవేత్తలు డాక్టర్. ఆర్ విశ్వతేజ, డాక్టర్ బి. సౌందర్య పాల్గొని అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు రానున్న వానకాలం పండించవలసిన పంటలు, నూతన రకాలు, నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు పంట వ్యర్థాలను కాలపెట్ట వద్దని, ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి, సేంద్రియ పద్ధతుల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని ఉండాలని తెలిపారు. ఆపై నూతన పద్ధతులపై రైతుల సందేహాలను నివృత్తి చేయడం జరిగింది.మండల వ్యవసాయ అధికారి వీరభద్రం మాట్లాడుతూ కల్లాల పై ఉన్న ధాన్యాన్ని కొనుగోలుకు ఐ.కె.పి. ద్వారా అన్ని ఏర్పాట్లు జరిగాయని తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కే. మంజుల , ఏఈఓ సాయి, పంచాయతీ సెక్రెటరీ మహమ్మద్ షంషుద్దీన్,అభ్యుదయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల తిరుపతి దేవస్థానానికి బయలుదేరిన భజన బృందం.



**ఖానాపురం, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి):**

మండల కేంద్రంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన భజన బృందం మే 1న తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొనడానికి భజన బృందం గ్రామంలో శ్రీ భూనీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను ఆలయ అర్చక స్వామి వేణు భజన బృందానికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను తీసుకుని తిరుమల తిరుపతి దేవస్థానముకు భజన బృందం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో భజన బృందం సింగు రమేష్, బైరెడ్డి మంజుల, సింగు సునీత, బైరెడ్డి వసుమతి, సింగు సూరమ్మ, ఓరుగంటి పుల్లయ్య, వాసంశెట్టి వినోద, జట్టంగి గంగాభవాని, బైరెడ్డి లక్ష్మి,, నల్లగుంట్ల అంజలి తదితరులు తరలి వెళ్లారు.

# చక్కని ఆరోగ్యం

# వేసవిలో చర్మ సంరక్షణ కోసం..!



వేడి, ఉక్కపోత, జిడ్డుదనం.. మొదలైన సమస్యలను ఎదుర్కొని వేసవిలో చర్మాన్ని సంరక్షించుకోవడమంటే సవాలనే చెప్పాలి. అయితే తెలిసో, తెలియకో చేసే చిన్న చిన్న పొరపాట్లు ఈ కాలంలో చర్మ సౌందర్యాన్ని మరింత దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. ఆ పొరపాట్లేంటో తెలుసుకొని సరిదిద్దుకుంటే అందంగా మెరిసిపోవచ్చంటున్నారు. ఆయా కాలాల్ని బట్టి సంపూర్ణ ఆరోగ్యం కోసం మన జీవనశైలిలో మార్పులు చేసుకున్నట్లే.. చర్మ సంరక్షణ విషయంలోనూ బ్యూటీ రొటీన్‌లో పలు మార్పులు తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఇవేవీ పట్టించుకోకుండా చేసే కొన్ని పొరపాట్లు ఈ కాలంలో చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటున్నారు. కాలమేదైనా ఎండ నుంచి చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్ లోషన్లు రాసుకోవడం అందరూ చేసేదే. అయితే వీటిని కూడా కాలాల్ని బట్టి మార్చాలంటున్నారు నిపుణులు. ప్రస్తుతం సన్‌స్క్రీన్లు తేలికపాటి లోషన్లు, జెల్స్, స్ప్రేలు, ఫోమ్స్.. ఇలా వివిధ రూపాల్లో మార్కెట్లో దొరుకుతున్నాయి. వివిధ క్రీముల మాదిరి ఇవి చర్మంపై పేరుకుపోకుండా సులభంగా చర్మంలోకి ఇంకిపోయి రక్షణ కల్పిస్తాయి. కాబట్టి చర్మతత్వాన్ని బట్టి ఇలాంటి తేలికపాటి ఉత్పత్తుల్ని ఎంచుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. అలాగే బయటికి వెళ్లినప్పుడే కాదు.. ఇంట్లో ఉన్నప్పుడూ నిర్ణీత వ్యవధుల్లో సన్‌స్క్రీన్ తప్పకుండా అప్లై చేసుకోవాలి.. అని సూచిస్తున్నారు. వేసవిలో చెమట, ఉక్కపోత వల్ల అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. అందుకే పదే పదే ముఖం కడుగుతుంటారు చాలామంది. ఈ అలవాటూ మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇలా పదే పదే ముఖాన్ని శుభ్రం చేసుకోవడం వల్ల చెమట, జిడ్డు తొలగిపోయి కాసేపటి దాకా బాగానే అనిపిస్తుంది. కానీ దీనివల్ల ముఖం మరింత జిడ్డుగా మారి మొటిమలకు దారితీస్తుందని చెబుతున్నారు. అందుకే రోజూ రెండు లేదా మూడుసార్లకు మించి ముఖం కడుక్కోవద్దని, అది కూడా రసాయనాల్లేని సహజసిద్ధమైన సబ్బులు, ఫేస్‌వాష్‌లు వాడడం మంచిదంటున్నారు. ఈ వేసవిలో చాలామంది చేసే పొరపాటు మాయిశ్చరైజర్ రాసుకోకపోవడం. ఈ కాలంలో దీని అవసరం ఉండదనుకుంటారు. కానీ ఈ నిర్లక్ష్యం వల్ల చర్మం పొడిబారిపోయే ప్రమాదం ఎక్కువంటున్నారు. అదెలాగంటే.. పదే పదే ఎండలోకి వెళ్లడం వల్ల చర్మం కింది పొర డీహైడ్రేట్ అవుతుందట! ఫలితంగా చర్మం తేమను కోల్పోయి నిర్జీవంగా కనిపిస్తుంది. అందుకే ఈ కాలంలోనూ మాయిశ్చరైజర్ మానద్దంటున్నారు నిపుణులు. కాకపోతే.. చర్మతత్వాన్ని బట్టి తేలికపాటి, నీటి ఆధారిత మాయిశ్చరైజర్లను ఎంపిక చేసుకోవడం మంచిదని చెబుతున్నారు. చర్మ సంరక్షణలో భాగంగా మృతకణాల్ని ఎప్పటికప్పుడు తొలగించడం కూడా ముఖ్యమే! అయితే ఇందుకోసం స్క్రబ్స్ వాడడం తెలిసిందే! వేసవి కాలానికి అనుగుణంగా, చర్మతత్వాన్ని దృష్టిలో పెట్టుకొని వీటినీ మార్చాలంటున్నారు నిపుణులు. ఎక్కువ బరకగా ఉండేవి పక్కన పెట్టి.. కాఫీ పొడి–కొబ్బరి నూనె, ఓట్‌మీల్–పెరుగు.. వంటి తేలికపాటి స్క్రబ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. ఇవి చర్మానికి తేమనందించడంతో పాటు చర్మాన్ని మృదువుగా మార్చుతాయని చెబుతున్నారు. అయితే ఇవి చర్మ తత్వానికి సరిపడతాయో లేదో ముందుగా పరీక్షించి చూసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# మచ్చ పడకుండా



మైదానంలో ఆటలాడుతూ కింద పడొచ్చు. చర్మం గీసుకుపోయి, గాయం కావొచ్చు. ఇంట్లో కూరగాయలలో, మరేదో కోస్తున్నప్పుడు పొరపాటున గాటు పడొచ్చు. పెద్దగా పట్టించుకోకుండానే ఇవి మానిపోతాయి కూడా. కానీ అక్కడ మచ్చ పడుతుంది. వీటిని నివారించుకోవటం లేదా పెద్దగా కనిపించకుండా చూసుకోవటమెలా? గాయమైన తర్వాత మచ్చ పడటానికి కారణం చర్మం లోపలి పొర (డెర్మిస్) చీరుకుపోవటం. అక్కడ చర్మం మరమ్మతు కావటానికి శరీరం కొలాజెన్ పోచలను ఉత్పత్తి చేస్తుంది. ఇవి గాయాన్ని బాగానే మాన్పుతాయి గానీ చర్మం పూర్తిగా మునుపటిలా కుదురుకోదు. అసలు చర్మం కన్నా భిన్నంగానే ఉంటుంది. ఇదే మచ్చలకు దారితీస్తుంది. అయితే గాయమైన తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నామనేది మచ్చల తీవ్రత మీద ప్రభావం చూపుతుంది. వాపును తగ్గించుకోవటం, మరింత దెబ్బతినకుండా చూసుకోవటం ద్వారా మచ్చను తగ్గించుకునే అవకాశముంది. గాయాన్ని పొడిగా ఉంచితే త్వరగా మానుతుందని చిన్నప్పటి నుంచీ వింటూనే ఉంటాం. నిజానికి తేమగా ఉంచితేనే మేలు. తేమ మూలంగా గాయం పొడిబారకుండా ఉంటుంది, గట్టి పక్కు ఏర్పడుతుంది. ఇది కణజాలం ఎక్కువగా దెబ్బతినకుండా, మచ్చ గాఢంగా ఏర్పడకుండా కాపాడుతుంది. గాయాన్ని కప్పి ఉంచటం ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా కాపాడుతుంది కూడా. గాయాన్ని మృదువైన సబ్బు, నీటితో శుభ్రం చేస్తే బ్యాక్టీరియా తొలగిపోతుంది. దీనికి మచ్చకు ఏంటీ సంబంధం? బ్యాక్టీరియా వాపును ప్రేరేపిస్తుంది. ఇది గాయం మానే ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తుంది. ఫలితంగా మరింత గాఢంగా మచ్చ ఏర్పడుతుంది. ఇన్‌ఫెక్షన్ తలెత్తినా గాయం మానటం ఆలస్యమవుతుంది. ఇదీ మచ్చ ఎక్కువయ్యేలా చేస్తుంది. అక్కడ చర్మం పైకి లేచి బుడిపెగానూ మారొచ్చు. గాయం మీద కట్టే పక్కు చర్మానికి సహజ రక్షణగా నిలుస్తుంది. గాయం పూర్తిగా మానిన తర్వాత దానంతటదే ఊడి వస్తుంది. కాబట్టి వేళ్లు అక్కడికి పోనివ్వకుండా చూసుకోవాలి. దురద పెడుతుందనో, మరో కారణంతోనో గోకొద్దు. పక్కును తొలగిస్తే గాయం త్వరగా మానదు. మచ్చ పెద్దగా పడుతుంది. గాయమైన చోటును కదపకుండా స్థిరంగా ఉంచాలి. అప్పుడు గాయానికి రెండు వైపులా చర్మం అంచులు సరిగ్గా అతుక్కుంటాయి. మచ్చ పెద్దగా పడదు. అదేపనిగా కదిపితే మాత్రం చీలిక పెద్దగా అయ్యి, మందంగా మచ్చ పడే అవకాశముంది. మచ్చ పడిన చోట కొద్దిసేపు మాయిశ్చరైజర్‌తో మృదువుగా మర్దన చేసుకోవటమూ మేలే. గాయం పూర్తిగా మానిన ఏడాది లోపు దీంతో మంచి ఫలితం కనిపిస్తుంది. మందంగా మారే అవకాశం గల మచ్చ కణజాలాన్ని ఇది విచ్ఛిన్నం చేస్తుంది. సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు వర్ణద్రవ్యాన్ని పెంచటం ద్వారా మచ్చలు స్పష్టంగా కనిపించేలా చేస్తాయి. ఈ కిరణాలు కొలాజెన్‌నూ దెబ్బతీస్తాయి. గాయాలు నయమయ్యే ప్రక్రియ కూడా నెమ్మదిస్తుంది. ఇదీ మచ్చలు తీవ్రం కావటానికి దారితీస్తుంది. మచ్చల మీద సన్‌స్క్రీన్ రాసుకోవటం లేదా ఎండ పడకుండా చూసుకుంటే అవి తక్కువగా కనిపించే అవకాశముంది.

# ఇమ్యూనిటీ పెరగాలంటే..!

రోగనిరోధక వ్యవస్థ పటిష్ఠంగా ఉంటే వివిధ వైరస్లు, బ్యాక్టీరియాలు మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపలేవు. అయితే రోగనిరోధక శక్తి దృఢంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారమూ ముఖ్యమే! అందులోనూ కొన్ని విటమిన్లుండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడే విటమిన్లలో విటమిన్ 'సి'ది కీలక పాత్ర. ఈ విటమిన్ లోపం ఉన్న వాళ్లు త్వరగా జబ్బు పడే అవకాశాలుంటాయి. అందుకే మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'సి' పుష్కలంగా లభించే కమలాఫలం, నిమ్మకాయ.. వంటి నిమ్మజాతి పండ్లను భాగం చేసుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అలాగే పాలకూర, క్యాప్సికం.. వంటివి కూడా మెనూలో చేర్చుకోవాలి. రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో విటమిన్ 'బి6' సహకరిస్తుంది. కాబట్టి ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే విటమిన్ 'బి6' అధికంగా లభించే అరటిపండ్లు, బంగాళాదుంపలు, చికెన్, చేపలు, శెనగలు.. వంటి ఆహార పదార్థాల్ని రోజువారీ మెనూలో భాగం చేసుకోవాలట. విటమిన్ 'ఇ' మన శరీరంలో ఒక శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్, ఇతర ఇన్ఫెక్షన్లతో సమర్థంగా పోరాడి.. అవి మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపకుండా కాపాడుతుంది. అలాగే ఈ విటమిన్ రోగనిరోధక వ్యవస్థను పటిష్టపరచడంలోనూ సహకరిస్తుంది. కాబట్టి ఇది ఎక్కువగా లభించే పొద్దుతిరుగుడు గింజలు, పల్లీలు, బాదంపప్పులు, పాలకూర, నట్స్.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు. ఈ విటమిన్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. అలాగే విటమిన్ 'ఎ' కంటి ఆరోగ్యానికి కూడా మంచిది. కాబట్టి క్యారట్స్, తర్బూజా, గుమ్మడికాయ, సొరకాయ.. వంటి విటమిన్ 'ఎ' ఎక్కువగా లభించే ఆహార పదార్థాల్ని తీసుకోవడం మంచిదంటున్నారు. రోగనిరోధక వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి, దాని రక్షణకు విటమిన్ 'డి' ఎంతగానో తోడ్పడుతుంది. కాబట్టి ఈ విటమిన్‌ను పొందడానికి ఉదయాన్నే లేలేత ఎండలో 10 నుంచి 30 నిమిషాల పాటు పాటు గడపాలి. అలాగే ఇది అధికంగా లభించే చేపలు, కోడిగుడ్లు, పాలు,.. వంటివి ఎక్కువగా తీసుకోవాలి. విటమిన్ 'డి' వల్ల ఎముకలు కూడా దృఢంగా మారతాయని చెబుతున్నారు నిపుణులు.



# కండర బలానికి ప్రొటీన్ ఒక్కటే కాదు

వయసు మీద పడుతున్న కొద్దీ కండరాలు క్షీణిస్తూ వస్తుంటాయి. వీటిని కాపాడుకోవటానికి ఏం తినాలి? అనగానే ప్రొటీన్‌తో నిండిన గుడ్లు, మాంసం వంటివే గుర్తుకొస్తుంటాయి. కండరాలు ఏర్పడటానికి, మరమ్మతు కావటానికి, క్షీణించకుండా ఉండటానికి ప్రొటీన్ అత్యవసరమే. కానీ ఇదొక్కటే కాదు, కండర క్షీణతను తగ్గించటానికి ఇతరత్రా పోషకాలూ అవసరమే. ఎందుకంటే ఇతర స్థూల, సూక్ష్మ పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు, ద్రవాలు, వ్యాయామంతో కలిసి ప్రొటీన్ కండరాలను కాపాడుతుంది మరి.



మలి వయసులో ఎంతో కొంత కండర మోతాదు తగ్గటం సహజమే. దీన్ని నిలువరించకపోతే కింద పడిపోవటం, ఎముకలు విరగటం, ఇతరుల మీద ఆధారపడాల్సి రావటం, రోజువారీ పనులు సరిగా చేసుకోలేకపోవటం వంటి ఇబ్బందులకు దారితీస్తుంది. మంచి విషయం ఏంటంటే కొన్ని జాగ్రత్తలతో కండరాలను కాపాడుకునే వీలుండటం. సమతులాహారం తినటంతో పాటు తగినంత వ్యాయామం చేయటం చాలా ముఖ్యం. ఇందుకు ప్రొటీన్‌తో పాటు ఇతర కీలక పోషకాల మీదా దృష్టి సారించటం మంచిది. శరీరానికి ప్రధానమైన శక్తి వనరులు ఇవే. మనం ఆహారం ద్వారా తీసుకున్న పిండి పదార్థంలో కొంత కండరాల్లో గ్లైకోజన్ రూపంలో నిల్వ ఉంటుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు శరీరం దీన్ని వాడుకుంటుంది. పిండి పదార్థం ఎప్పటికప్పుడు దీన్ని భర్తీ చేస్తుంది. ఒకవేళ తగినంత పిండి పదార్థం తీసుకోకపోతే శరీరం శక్తి కోసం కండర కణజాలాన్ని ఉపయోగించుకుంటుంది. ఇది కండర క్షీణతకు దారితీస్తుంది. అయితే నిండు గింజ ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పప్పులతో లభించే నాణ్యమైన పిండి పదార్థాన్ని తీసుకోవటం మంచిది. ఇది మన శరీరంలో 300కు పైగా జీవరసాయన చర్యల్లో పాలు పంచుకుంటుంది. వీటిల్లో చాలావరకూ కండర ఆరోగ్యంతో నేరుగా ముడిపడినవే కావటం గమనార్హం. కండరాల సంకోచం, వ్యాకోచం వంటి పనులు సజావుగా సాగటానికి మెగ్నీషియం అవసరం. ఇది ప్రొటీన్లు ఉత్పత్తి కావటానికి, వాపుప్రక్రియ తగ్గటానికీ తోడ్పడుతుంది. ఇలా కండర మరమ్మతు ప్రక్రియ సాఫీగా జరిగేలా చేస్తుంది. ఆకుకూరలు, చిక్కుళ్లు, పప్పులు, గింజ పప్పులు, విత్తనాలు, నిండు గింజ ధాన్యాల్లో మెగ్నీషియం దండిగా ఉంటుంది. అయితే ఆకలి, పోషకాలను శోషించుకునే సామర్థ్యం తగ్గటం వల్ల వృద్ధుల్లో చాలామందికి ఆహారం ద్వారా తగినంత మెగ్నీషియం అందదని గుర్తుంచుకోవాలి. దీన్ని ఒక పోషకంగా ఎవరూ గుర్తించరు. కానీ మనం జీవించి ఉండటానికిది తప్పనిసరి. కండర మోతాదులో 76% వరకూ ఉండేది ఇదే. అందువల్ల కండర సామర్థ్యం పెరగాలన్నా, సజావుగా పనిచేయాలన్నా, కండరాలు క్షీణించకుండా ఉండాలన్నా తగినంత నీరు తాగటం ముఖ్యం. వృద్ధులకు దాహం వేస్తున్న సంగతి సరిగా తెలియదు. అందువల్ల సరిగా నీరు తాగరు. దీంతో ఒంట్లో నీటి శాతం తగ్గుతుంది. ఇది కండర ప్రొటీన్ విచ్ఛిన్నమయ్యే ముప్పు పెరిగేలా చేస్తున్నట్టూ అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి భోజనం చేసినప్పుడే కాకుండా రోజంతా అప్పుడప్పుడు నీరు తాగేలా చూసుకోవాలి. రక్తం ద్వారా ఆక్సిజన్‌ను చేరవేయటం, శక్తి ఉత్పత్తి చేయటం ద్వారా ఐరన్ కండరాల పనితీరులో ముఖ్య భూమిక పోషిస్తుంది. దీని మోతాదులు తగ్గితే కండర కణాల్లో ఆక్సిజన్‌ను నిల్వ చేసే మయోగ్లోబిన్ అనే ప్రొటీన్‌ను సరిగా ఉత్పత్తి కాదు. దీంతో కండర సామర్థ్యం తగ్గుతుంది. ఐరన్ లోపం రక్తహీనతకూ దారితీస్తుంది. ఇందులో కణజాలాలకు ఆక్సిజన్‌ను చేరవేసే ఎర్ర రక్తకణాల సంఖ్య, హీమోగ్లోబిన్ మోతాదులు పడిపోతాయి. ఇది కండరాలకూ చేటు చేస్తుంది. చికెన్, మాంసం, చేపలు, టోఫు, పప్పులు, ఐరన్ కలిపి తయారుచేసే తృణధాన్యాలతో ఐరన్ లభిస్తుంది. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయనే సంగతి తెలిసిందే. మంచి కొవ్వుల తరగతికి చెందిన వీటి వాపు నివారణ గుణాలు కండరాలకూ మేలు చేస్తాయి తెలుసా? కణ స్థాయిలో తలెత్తే వాపు ప్రక్రియ దీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తుంటే కండరాలూ దెబ్బతింటాయి మరి. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో ప్రొటీన్ల ఉత్పత్తి, కణజాలాల మరమ్మత్తు మెరుగవుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

# పక్షవాతానికి కొత్త చికిత్స

ప్రపంచవ్యాప్తంగా వైకల్యం, మరణానికి దారితీస్తున్న ప్రధాన కారణాల్లో పక్షవాతం ఒకటి. దీన్నుంచి బతికి బయటపడ్డ వారిలో ఎంతోమంది సరిగ్గా కదల్లేక, ఇంటికే పరిమితమవుతున్నారు. ఇలాంటి దుస్థితిని తప్పించటానికి పరిశోధకులు చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు. మెదడు దెబ్బతినటాన్ని నివారించటానికి, పక్షవాతం అనంతరం నాడులు తిరిగి కోలుకోవటానికి తోడ్పడే కొత్త చికిత్సల కోసం అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో రక్తనాళం ద్వారా ఇచ్చే (ఐవీ) తాజా చికిత్స ఒకటి మేలి మలుపుగా కనిపిస్తోంది. ఇది మెదడు ఎక్కువగా దెబ్బతినకుండా చూడటంతో పాటు మరింత బాగా కోలుకునేలా చేస్తుండటం గమనార్హం. దీని ప్రాథమిక ఫలితాలు న్యూరోథెరప్యూటిక్స్ పత్రికలో ప్రచురితమయ్యాయి. పక్షవాతం వచ్చినప్పుడు దెబ్బతినే అవకాశం గల మెదడు కణజాలం చుట్టూ ఇది 'పొర'లా ఏర్పడటం ద్వారా నాడులు చనిపోకుండా కాపాడుతున్నట్టు, వాపు ప్రక్రియను తగ్గిస్తున్నట్టు పరిశోధకులు భావిస్తున్నారు. పక్షవాతం బారినపడ్డప్పుడు తొలి 6–12 గంటల్లో ఈ మందును రక్తనాళం ద్వారా ఇవ్వాల్సి ఉంటుంది. ఇది మెదడులోని భాగాలు దెబ్బతినటాన్ని తగ్గిస్తున్నట్టు కొందరిపై నిర్వహించిన ప్రయోగ పరీక్షల్లో తేలటం గమనార్హం. అలాగే మాటలు, కదలికలు త్వరగా తిరిగి వచ్చినట్టూ బయటపడింది. ఒక్క ప్రామాణిక చికిత్స మాత్రమే తీసుకున్నవారితో పోలిస్తే వీళ్లు రోజువారీ పనులు మరింత త్వరగా చేసుకునే విధంగా కోలుకున్నట్టూ వెల్లడైంది. చికిత్సను బాగా తట్టుకోవటం, తీవ్రమైన దుష్ప్రభావాలేవీ లేకపోవటం మరో మంచి విషయం.



# 'ఎరుపు' ఎంతో బలం!



ఎర్రెర్రటి స్ట్రాబెర్రీని చూడగానే నోట్లో నీళ్లూరిపోతాయి. కెంపు రంగులో మెరిసే దానిమ్మ గింజల్ని అలా చటుక్కున నోట్లో పెట్టుకోవాలనిపిస్తుంది. అల్లంత దూరం నుంచే ఎర్రటి పుచ్చకాయ ముక్కలు కడుపు నింపేస్తాయి. ఇవేనా... రెడ్ కలర్ కూరగాయలూ, ఆకుకూరలన్నీ కూడా తినకముందే రంగుతోనే ఆకట్టుకుంటాయి. అయితే ఆ మెరిసే వర్ణం కేవలం ఆకర్షణ కోసమే కాదు, ఆరోగ్యాన్ని అందించే ప్రత్యేక కారకం కూడా. మరీ ముఖ్యంగా మండుటెండల్లో ఈ ఎరుపు రంగు ఆహారపదార్థాలతో ఎన్నెన్నో లాభాలున్నాయి. ఆసక్తికరమైన ఆ వివరాల్లోకి వెళితే... ప్రకృతి ప్రసాదించిన పండ్లూ, కూరగాయల్లో– ఆకుపచ్చ, పసుపు, ఊదా, తెలుపు, నీలం, ఎరుపు... ఇలా బోలెడు రంగులు ఉంటాయి. వాటిల్లో రుచి మీదనే ఎక్కువగా ఫోకస్ చేస్తూ ఆయా పదార్థాల్ని మనం రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటాం కానీ– వాటి రంగును బట్టి అవి ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలూ ఉంటాయని తెలుసా? అందులోనూ అన్ని వర్ణాల్లో హైలైట్ అయ్యే రెడ్ ఫుడ్ ప్రత్యేకత ఏంటో ఎప్పుడైనా విన్నారా? ఆకట్టుకునే ఈ కలర్‌ఫుల్ ఆహారం– శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తూనే, రోగాలు దరిచేరకుండా కాపాడుతుంది. మిగతా వాటితో పోల్చితే బెస్ట్ సూపర్‌ఫుడ్‌గా పేరు తెచ్చుకున్న ఈ ఎర్రటి ఆహార పదార్థాల పూర్తి కథ తెలిసిందంటే కచ్చితంగా మీరూ ఈ రెడ్‌ఫుడ్‌తో ప్రేమలో పడిపోవాల్సిందే! మామూలుగా ప్రకాశవంతమైన ఎరుపు రంగును– శక్తికీ, ధైర్యానికీ, ప్రేమకీ గుర్తుగా చెబుతుంటాం కదా. అదే రంగు– పండ్లూ, కూరగాయలూ, ఆకుకూరల పోషక విలువల్నీ పెంచింది మరి. విటమిన్లూ, ఖనిజాలతో నిండిన ఈ పదార్థాలు శరీరంలో అన్నింటి కన్నా ముఖ్యమైన గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయట. అందుకే, రెడ్‌ఫుడ్‌ని 'కలర్ ఆఫ్ ది హార్ట్'గా పిలుస్తున్నారు. అసలింతకీ ఈ రంగుకి కారణం ఏంటీ అంటే... పండ్లూ, కూరగాయల్లో క్లోరోఫిల్ వర్ణద్రవ్యం ఉండటం వల్ల వాటికి ఆకుపచ్చ రంగు వస్తే, పసుపు రంగు రావడానికి కారణం అందులోని కెరోటినాయిడ్లు. అదే వాటిలో లైకోపీన్, యాంతోసయానిన్లు అనే పిగ్మెంట్లు ఉండటం వల్ల ఆహార పదార్థాలు ఎర్రని ఎరుపు రంగులోకి మారుతుంటాయి. ఈ వర్ణద్రవ్యాలు రంగుతోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాల్నీ అందిస్తాయి. పూర్వకాలంలో ఆ రంగు గొప్పతనం వల్లనే ఈజిప్షియన్లూ, గ్రీకులూ దానిమ్మ పండును పవిత్రమైన పండుగా భావించేవాళ్లట. దీన్ని ఆయుర్దాయాన్ని పెంచే ఆహారంగా కూడా చెప్పుకునేవాళ్లు. ఇంకా రోజూ తప్పకుండా తినే ఎర్రటి ఆహార పదార్థాల్లో మొదటిది కచ్చితంగా టొమాటోనే అని చెబుతాం కదా. కానీ ఒకప్పుడు దీని ఆకర్షణీయమైన రంగును చూసి, టొమాటో మొక్కల్ని కేవలం అలంకరణ కోసం పెంచేవాళ్లట. తర్వాత ఆ పండులోని పోషకాల సంగతి తెలిశాక, ప్రపంచ దేశాల్లో తప్పనిసరి ఆహారంగా మారింది! నిజానికి తాజా పండ్లూ, కూరగాయలంటేనే ఆరోగ్యం కదా! అందులో మళ్లీ రంగుదేముందీ



అంటారేమో కానీ– అది పోషకాల మీద ఎంతో ప్రభావం చూపిస్తుంది. ఆ ముదురు రంగు అందులోని అధిక యాంటీఆక్సిడెంట్లను సూచిస్తుంది. ఇంకా ఎ,సి– విటమిన్లూ, పొటాషియం, ఫైబర్, ఖనిజాల్లాంటివి ఎక్కువగా ఉండే ఈ రెడ్ కలర్ ఫుడ్‌లో రెట్టింపు పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా దీంట్లోని లైకోపీన్ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే ఈ పిగ్మెంట్ ఎక్కువగా ఉండే టొమాటో మొదలు పుచ్చకాయ వరకూ రకరకాల ఎర్రటి ఆహార పదార్థాలు– రక్తపోటును నియంత్రిస్తూ గుండె జబ్బులూ రాకుండా కాపాడతాయి. ఎరుపు రంగు ఆహార పదార్థాల్లోని ఫైటో కెమికల్స్ క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్, లంగ్ వంటి క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటాయి. ఇవి మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఎండాకాలంలో ఈ రెడ్‌ఫుడ్ చర్మ రక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది. తీవ్రమైన సూర్యకిరణాల నుంచి కాపాడుతూనే, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడానికి సాయపడుతుంది. నీరసాన్ని తగ్గించి, తక్షణ శక్తిని ఇస్తుంది. వేసవిలో కుదిరినప్పుడల్లా పుచ్చకాయను తినడం వల్ల శరీరం డీహైడ్రేట్ అవకుండా ఉంటుంది. ఎర్రటి ఆహారపదార్థాల్లోని బెటాలెయిన్స్ వల్ల శరీరంలోని వ్యర్థాలు సులువుగా బయటకు వెళతాయి. వీటిల్లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలోని వాపుల్నీ, నొప్పుల్నీ తగ్గిస్తాయి. సి–విటమిన్ ఎక్కువ ఉండే ఈ పదార్థాల ద్వారా వ్యాధినిరోధక శక్తి బాగా పెరుగుతుంది. సీజనల్ వ్యాధులూ, ఇన్‌ఫెక్షన్లూ తగ్గుతాయి. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. రెడ్ ఫుడ్‌లోని బీటా కెరోటిన్ వల్ల కంటి ఆరోగ్యమూ బాగుంటుంది. కంటి సమస్యలు ఉన్నవారు నిత్యం దీన్ని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. రాస్‌బెర్రీ, చెర్రీ తదితర పండ్లను రోజూ తినడం వల్ల జీర్ణసంబంధ వ్యాధులూ దరిచేరవట. దానిమ్మ గింజల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని వాపును తగ్గిస్తాయి. చక్కెర స్థాయుల నియంత్రణకూ దానిమ్మ పండును తినొచ్చు. రోజూ ఈ ఎర్రటి కాయగూరల్ని తినడం వల్ల పురుషులలో సంతానోత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పరిశోధనల్లో బయటపడింది.

బీట్‌రూట్ రక్తహీనతను తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రెడ్ క్యాప్సికంతో శరీరానికి కావాల్సినంత సి–విటమిన్ అందుతుంది. ఎర్ర మిరపకాయల్లో క్యాన్సర్లతో పోరాడే గుణాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎర్రటి తోటకూరలో ఐరన్ తగినంత దొరుకుతుంది. ఇది హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనతను తగ్గిస్తుంది.

యాంతోసయానిన్లు దండిగా ఉండే ఈ రెడ్ ఫుడ్– మెదడు పనితీరుకీ, నాడీ వ్యవస్థకీ ఎంతో మంచిది. ఈ వర్ణద్రవ్యం రక్త ప్రసరణను మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. దానిమ్మ, చెర్రీలతోపాటు ఎర్ర ఉల్లిపాయ,ఎర్ర ముల్లంగి, రెడ్ క్యాబేజీ... తదితర కాయగూరల్లోనూ ఈ యాంతోసయానిన్లు అధికంగా ఉంటాయి.ట్రైగ్లిజరైడ్లూ, కొలెస్ట్రాల్‌ని నియంత్రించడంలోనూ ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.



బరువు తగ్గాలనుకునేవాళ్లకూ ఎర్రటి ఆహారపదార్థాలు బాగా ఉపయోగపడతాయి. తక్కువ క్యాలరీలూ, ఎక్కువ ఫైబర్‌తో ఉండే వీటితో జీవక్రియ పనితీరు సజావుగా జరుగుతుంది. స్ట్రాబెర్రీ పండ్ల నుంచి ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, సి,కె–విటమిన్లు అధికంగా లభిస్తాయి. ఎర్రటి క్రాన్‌బెర్రీ పండు... పొట్ట అల్సర్‌కి కారణమయ్యే బ్యాక్టీరియాని చంపుతుంది. మూత్రనాళంలో బ్యాక్టీరియా పేరుకుపోకుండా కాపాడుతుంది. ఎముక బలానికీ ఎర్రటి ఈ కాయగూరలూ, పండ్లూ ఎంతో ఉపయోగపడతాయట.

